TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :83 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 29-05-2025 పేజీలు:4 వెల: 2.00

## అసత్య ప్రచారాల్లో ఆరితేరిన పాక్

న్యూఢిల్లీ,పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అందజేసిన చిత్రపటం బహుమతిపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కువైట్‌లో భారతీయ ప్రవాసులతో జరిగిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో మాట్లాడిన ఓవైసీ, పాకిస్తాన్ చేస్తున్న అబద్ధ ప్రచారాన్ని ఉద్దేశిస్తూ, నకల్ కర్నేకే లియే అకల్ చాహియే' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2019లో చైనా సైన్యం నిర్వహించిన డ్రిల్‌కు చెందిన ఫోటోను ఇప్పుడు పాక్ సైన్యం 'ఆపరేషన్ బన్యాన్' విజయంగా చిత్రీకరించి ప్రధానికి బహుమతిగా ఇస్తున్నారంటే ఎంత దిగజారిపోయారో అర్థం అవుతుందని ఆయన మండిపడ్డారు. పాకిస్తాన్ చేస్తున్న అసత్య ప్రచారాలపై ప్రజలు నమ్మకం పెట్టకూడదని, అధికారిక భారత ప్రభుత్వ ప్రకటనలకే మద్దతు ఇవ్వాలంటూ ప్రవాస భారతీయులకు ఓవైసీ సూచించారు. భారత్ అంతర్జాతీయంగా శక్తిమంతమైన దేశంగా ఎదుగుతున్న వేళ, ఇలాంటి అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలన్న ప్రయత్నాలు ఎంత సిగ్గుచేటో అని విమర్శించారు. పాక్ తీరును ఆయన తీవ్రంగా ఎండగట్టారు.

# కవిత తానేంటో నిరూపించుకోవాలనుకుంటున్నారా?



హైదరాబాద్,భారత రాష్ట్ర సమితిలో తన పాత్రపై స్పష్టత కోరుతున్న కవిత ఇక దూకుడు పెంచాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ఏదో ఇస్తే తీసుకున్నట్టు కాకుండా. తానేంటో నిరూపించుకోవాలనుకుంటున్నారట ఆమె. తండ్రి కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ బయటికి లీకవడం, దాని మీద పెద్ద స్థాయిలో రాజకీయ రచ్చ అవుతున్న క్రమంలో కేసీఆర్ దూతలు ఇద్దరు కవితతో నేరుగా సమావేశమై చర్చించినట్టు తెలుస్తోంది. అయితే%ౌ% నేనడిగే ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు వచ్చేదాకా, పార్టీలో నా పాత్ర ఏంటో తేలేదాకా%ౌ% మాటల్లేవ్ మాట్లాడుకోవడాల్లేవ్ అని వాళ్ళకి తేల్చి చెప్పేసినట్టు సమాచారం. ముందు నా సంగతేంటో తేల్చండి. ఆ తర్వాతే మిగతా విషయాలు మాట్లాడుకుందాం.. అంటూ ఆమె క్లియర్‌గా చెప్పేశారట. ఒక రకంగా ఇది స్వీట్ వార్నింగ్ అన్న అభిప్రాయం బలుపడుతోంది రాజకీయవర్గాల్లో. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులైన మాజీ ఎంపీ దామోదర్ రావు, గండ్ర మోహన్‌రావు కవితను కలిశాక రెండు ప్రధానమైన డిమాండ్స్ తెర మీదికి వచ్చాయట. బీఆర్ఎస్‌లో తన భవిష్యత్తు గురించి, తన పాత్ర ఏంటో కూడా స్పష్టత ఇవ్వాలని కవిత కోరినట్టు తెలిసింది.అలాగే తండ్రికి తాను రాసిన లేఖ ఎలా లీక్ అయిందో తెలుసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. దూతలు ఇచ్చిన సమాధానాలతో ఆమె ఒకింత చల్లబడ్డారన్న మాటలు వినిపిస్తున్న టైంలోనే ఊహించని పరిణామం ఒకటి జరిగింది. ఆ భేటీ ముగిసిన 24 గంటల్లోనే కవిత సింగరేణిలో జాగృతి అనే కొత్త సంస్థ ప్రారంభించారు. ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని అభిప్రాయ పడుతున్నారు ఎక్కువ మంది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు అనుబంధంగా సింగరేణిలో టీజీబీకేఎస్ ఉంది. అయితే కవిత దీనిని పక్కన పెట్టి జాగృతి సింగరేణి విభాగంను ప్రారంభించడం వెనక ఉద్దేశ్యం ఏంటన్న చర్చ నడుస్తోంది రాజకీయవర్గాల్లో. ఒక రకంగా ఇది బీఆర్ఎస్ అధిష్టానానికి వార్నింగేనన్నది ఎక్కువ మంది అభిప్రాయం. ఈ చర్యతో మూడు ముఖ్యమైన సంకేతాల్ని పార్టీ అధినేతకు పంపాలని కవిత భావిస్తున్నట్టు తెలుస్తోంది. తన సొంత బలాన్ని చాటుకోవడానికి కవిత ఆరాటపడుతున్నారన్నది తొలి సంకేతం. ఇక అధిష్ఠానాన్ని నేరుగా ప్రశ్నించకపోయినా పరోక్షంగా తన పాత్రను గుర్తించాలన్న డిమాండ్ ఉందని అంటున్నారు. మూడోది తనను నిర్లక్ష్యం చేస్తే కొత్త వేదికలు తయారు చేసుకుని ముందుకు వెళ్లేందుకు కూడా వెనుకాడబోనని చేస్తున్న హెచ్చరిక కావచ్చన్నది విశ్లేషకుల మాట.అయితేతాజా పరిణామాలపై కేసీఆర్ ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం, ఆయన ఏమనుకుంటున్నారో బయటికి తెలియకపోవడంతో బీఆర్ఎస్ కేడర్‌లో అయోమయం పెరుగుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఓవైపు దూతల ప్రత్నాలు ఫలించకపోగా%ౌ%. మరోవైపు అధినేత నిశ్శబ్దం కేడర్‌ని డైలమాలో పడేస్తోందని అంటున్నారు. తగ్గేదే లే అంటున్న కవిత ఈ ఎపిసోడ్‌ను ఎంతదాకా తీసుకువెళ్తారన్న చర్చ కూడా జరుగుతోందట బీఆర్ఎస్ వర్గాల్లో. అసలు ఆమె బలమెంత? తిరుగుబాటు ఎక్కడికి చేరుతుంది, కేసీఆర్ దీన్ని ఎలా తీసుకుంటారన్న ప్రశ్నలకు ప్రస్తుతానికి మౌనమే సమాధానం అట. అయితే%ౌ% కవిత సొంత వేదికలను సిద్ధం చేసుకుంటున్నందున కాస్త ఓపిక పడితే%ౌ% ఆ ముచ్చటేందో కూడా తెలిసిపోతుంది కదా అన్న ఆలోచన గులాబీ పెద్దల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద ఇది తాత్కాలిక భేటీలు, ఒకటి రెండు మీటింగ్స్‌తో తేలిపోయే అంశం కాదని, అంతర్గతంగా రాజకీయ సమీకరణాలను మార్చే ఘట్టమేనన్న వాదన బలపడుతోంది. పరిణామాలు ఎట్నుంచి ఎటు మారతాయోనని ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీయవర్గాలు.

# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్..



హైదరాబాద్,ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్. పెండింగ్‌లో ఉన్న డీఏలలో రెండు చెల్లించడానికి తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అలాగే, ఉద్యోగుల రిటైర్మెంట్ రోజునే వారికి రావాల్సిన బెనిఫిట్స్?లో కొంత మొత్తం చెల్లించడానికి కూడా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.ఉద్యోగ సంఘాలు త్రిసభ్య కమిటీకి కొన్ని అంశాలను నివేదించాయి. దీనిపై ఇప్పటికే సర్కారు సానుకూలంగా స్పందించింది. ఇందులోని పలు ఆర్థిక పరమైన డిమాండ్లను కూడా ప్రభుత్వం నెరవేర్చనున్నట్లు సమాచారం.ఉద్యోగుల సమస్యలపై సర్కారు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ.. ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమైంది. సర్కారుకి పలు సిఫార్సులతో కూడిన నివేదిక సిద్ధం చేసింది. ఉద్యోగ సంఘాలు నివేదించిన కొన్ని అంశాలను నిన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆ కమిటీ అధికారులు వివరాలు తెలిపారు.దీంతో ఈ నెల 29న సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలతో పాటు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని అందులో చెప్పాలని భట్టి విక్రమార్క అన్నారు.ఉద్యోగులకు సంబంధించిన 40కి పైగా సమస్యలను పరిష్కరించేందుకు సర్కారు సానుకూలంగా ఉంది. ఆయా అంశాలు ఆర్థిక విషయాలకు ముడిపడి లేవు.అలాగే, పలు ఆర్థిక సమస్యల పరిష్కారానికి సైతం సర్కారు పచ్చజెండా ఊపనున్నట్లు సమాచారం. అలాగే, సీపీఎస్ రద్దుతో పాటు ఓపీఎస్ పునరుద్ధరణపై మరింత అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది.ఇం దుకు మరో కమిటీని ఏర్పాటు చేసే ఛాన్స్ ఉంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల వేళ బదిలీ అయిన అధికారులను మళ్లీ ఆయా ప్రాంతాలకు పంపించే అవకాశం ఉంది.

# రద్దీ ఉన్న ప్రాంతాలు.. వీకెండ్ లో.. పీక్ అవర్స్ లోనే బాంబ్ బ్లాస్ట లకు ప్లాన

హైదరాబాద్,బాంబు పేలుళ్ల కేసులో పట్టుబడిన సిరాజ్ గ్యాంగ్ వేసిన స్కెచ్ మామూలుగా లేదు. తొలుత విజయనగరంలోనే బాంబ్ బ్లాస్ట్ చేయాలన్నది పథకంలో ప్రధానం. మారుమూల ప్రాంతంలో ఉన్న జిల్లా కేంద్రంలో బాంబుపేలుళ్లు జరిపితే ఎవరికి అనుమానం రాదని, దాని విచారణ కొనసాగేలోపు హైదరాబాద్ లో మరికొన్ని ప్రాంతాల్లో వరస బాంబ్ బ్లాస్ట్ లకు సిరాజ్ గ్యాంగ్ ప్లాన్ చేసింది. సౌదీ నుంచి వచ్చిన డైరెక్షన్ మేరకు జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు పీక్ అవర్స్ లోనే బాంబు పేల్చి భారీగా ప్రాణ నష్టం కలిగించాలన్నది సిరాజ్ కు సౌదీ నుంచి వచ్చిన ఆదేశాలు అని ఎన్ఐఏ అధికారుల విచారణలో తేలినట్లు తెలిసింది. దీంతో వీరి అరెస్ట్ తో పెద్దముప్ప తప్పింది.

యువతను సమీకరించి...

ఉదయం వేళ కంటే సాయంత్రం వేళ రద్దీ ఎక్కువగా ఉంటుందని, వీకెండ్ లో అయిదే జనాలు ఎక్కువగా ఉంటారని, ఆ సమయంలోనే బాంబ్ బ్లాస్ట్ చేయాలని సిరాజ్ గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు సమాచారం. బస్టాండ్ లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్ వంటి ప్రాంతాల్లో బాంబు బ్లాస్ట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు ఎన్ఐఏ అధికారులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించి ఒక సామాజికవర్గానికి చెందిన యువకులను పెద్దయెత్తున సమీకరించి వారిని ఉగ్రవాదం వైపు మళ్లించాలన్నది కూడా సిరాజ్ కు అందిన ఆదేశాలని వినికిడి. వారిని స్లీపర్ సెల్స్ గా మార్చి అహీమ్ సంస్థ ద్వారా పేలుళ్లకు ఈ ప్లాన్ వేసినట్లు సిరాజ్ ఎన్ఐఏ అధికారుల విచారణలో అంగీకరించారు. విజయనగం అయితే ఎవరికీ అనుమానం రాదని, విచారణ ప్రారంభమయ్యే సరికి మనం అక్కడి నుంచి వెళ్లేందుకు సులువుగా ఉంటుందని భావించారు. పొరుగున ఉన్న ఒడిశా మీదుగా బయలు దేరి ఇతర రాష్ట్రాల్లో కొన్ని రోజులు ఉండి తిరిగి హైదరాబాద్ లో పేలుళ్లకు కుట్ర పన్నారు.



మ్యాజిక్ లాంతర్ ద్వారా...

సిరాజ్ గ్యాంగ్ హైదరాబాద్, విజయనగరంలో రెక్కీ నిర్వహించడంతో ఆ యా ప్రాంతాల్లో సీన్ రీకన్ స్ట్రక్షన్ చేయాలని ఎన్ఐఏ అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్ తో పాటు వరంగల్, బెంగళూరు, ఢిల్లీలో జరిగిన సమావేశాలకు ఎవరెవరు హాజరయ్యారు? ఎంత మంది ఈ ప్లాన్ లో భాగస్వామ్యులయ్యారు? సమావేశం వివరాలపై సిరాజ్, సమీర్ లను ఆరా తీసినట్లు తెలిసింది. కర్ణాకట, మహారాష్ట్రకు చెందిన పన్నెండు మంది సభ్యులపై కూడా ఆరా మొదలయింది. అదే సమయంలో స్లీపర్ సెల్స్ ను బలోపేతం చేయడానికి మ్యాజిక్ లాంతర్, సౌదీ , ఒమన్, పాకిస్తాన్ ల నుంచి నిధులు భారీగా వచ్చినట్లు అనుమానం ఎన్ఐఏ అధికారుల్లో వ్యక్తమవుతుంది. ఆ దిశగా విచారణ కొనసాగుతున్నట్లు తెలిసింది. సిరాజ్, సమీర్ లను మరికొంత కాలం కస్టడీకి కోరుతూ న్యాయస్థానంలో పిటీస్ వేయాలని కూడా ఎన్ఐఏ అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

# పహల్గాం దాడి జరిగిన చోటే మంత్రుల సమావేశం..



జమ్మూ కాశ్మీర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్ర దాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. అయితే, ఈసారి ప్రభుత్వం భయపడి వెనక్కి తగ్గకుండా ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన మంత్రుల బృందంతో కలిసి, శ్రీనగర్ లేదా జమ్మూలోని తమ సాధారణ ఆఫీసుల్లో కాకుండా నేరుగా పహల్గాం వెళ్లి క్యాబినెట్ మీటింగ్ నిర్వహించారు. ఇది కేవలం ఒక మీటింగ్ కాదు ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు తాము భయపడబోమని, ప్రజలకు అండగా ఉంటామని చెప్పే ఒక గట్టి జవాబు అని చెప్పొచ్చు.ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ అనే ప్రాంతంలో జరిగిన దాడిలో అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాత పర్యాటకుల రాక పూర్తిగా తగ్గిపోయింది. దీంతో పర్యాటకంపైనే ఆధారపడి జీవనం సాగించే స్థానిక ప్రజలు భయపడిపోయారు. వారి భయాలను పోగొట్టడానికి, వారికి ధైర్యం చెప్పడానికే సీఎం ఒమర్ అబ్దుల్లా ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు."మేం మా ప్రజల ధైర్యాన్ని చూసి గర్విస్తున్నాం. పర్యాటకాన్ని తిరిగి ప్రోత్సహించడానికి మేము పహల్గాం వచ్చాం. మా ప్రయత్నాలు కొనసాగుతాయి" అని ఒమర్ అబ్దుల్లా మీడియాతో అన్నారు. పహల్గాం క్లబ్‌లో జరిగిన ఈ సమావేశం దృశ్యాలను ఆయన తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. "ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు మేము ఏమాత్రం భయపడబోమని చెప్పడానికే ఇక్కడికి వచ్చాం. జమ్మూకశ్మీర్ దృఢంగా నిలబడుతుంది" అని ఆయన పోస్ట్‌లో రాశారు.ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇలా రాజధాని నగరాల బయట క్యాబినెట్ సమావేశాలు నిర్వహించడం కొత్తేమీ కాదు. 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ ఆయన గురెజ్, మచిల్, తాంగ్‌ధర్ (ఉత్తర కశ్మీర్), రాజౌరీ, పూంచ్ (జమ్మూ ప్రాంతం) వంటి మారుమూల ప్రాంతాల్లోనూ ఇలాంటి మీటింగ్స్ పెట్టారు. ఇది ఆయన పాలనా శైలిలో ఒక ముఖ్యమైన భాగం.ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షత వహించే నీతి ఆయోగ్ సమావేశాన్ని కూడా పహల్గాంలోనే నిర్వహించాలని ఒమర్ అబ్దుల్లా కోరారు. ఇలాంటి చర్యలు స్థానిక ప్రజలలో ఉగ్రవాదం పట్ల ఉన్న భయాలను తగ్గిస్తాయని, ప్రభుత్వం తమకు అండగా ఉందని వారికి నమ్మకం కలిగిస్తాయని ఆయన నమ్ముతున్నారు. దాడి జరిగిన ప్రాంతంలోనే మంత్రులు సమావేశం కావడం ద్వారా, ప్రజలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, పర్యాటకాన్ని తిరిగి గాడిలో పెడుతుందని స్పష్టమైన సందేశం పంపారు.

# తెలంగాణలో దంచికొట్టిన వాన..

హైదరాబాద్ : తెలంగాణలో నైరుతి రుతుపవనాలతో పాటు అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నిన్న ఆయా జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని జనగామ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జనగామ జిల్లా గూడురులో 136.5 మి.మీ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుండాలలో 121.5 మి.మీ., ములుగు జిల్లా మంగపేటలో 119.0, కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గాయిలో 118.0, సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో 116.3, కరీంనగర్ జిల్లా కాశీంపేటలో 115.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

దాదాపు అన్ని జిల్లాలకు వర్ష సూచన

రాష్ట్రంలో బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, సిద్దిపేట, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువొచ్చని అధికారులు తెలిపారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.గురువారం జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువొచ్చని చెప్పారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.



# రాజ్యసభకు కమల్ హాసన్.. డీఎంకే అధికారిక ప్రకటన



చెన్నై: ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ అధినేత కమల్ హాసన్‌రాజ్యసభకు వెళ్లడం దాదాపు ఖరారయినట్లే!. తమిళనాడు నుంచి ఆయనకు ఈ పదవి దక్కనుంది. కమల్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ డీఎంకే బుధవారం అధికారిక ప్రకటన చేసింది.రాజ్యసభలో ఖాళీగా ఉన్న 8 స్థానాలకుగానూ వచ్చే నెల(జూన్) 19వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఆరు తమిళనాడు నుంచి, రెండు అసోం నుంచి ఉన్నాయి. తమిళనాడులో ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే.. డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ లెక్కన ఆరు సీట్లలో నాలుగింటిని డీఎంకే.. మరో రెండింటిని అన్నాడీఎంకే దక్కించుకునే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి.నలుగురు అభ్యర్థుల్ని డీఎంకేఇవాళ ప్రకటించగా.. అందులో కమల్ హాసన్(70) కూడా ఉన్నారు. మిగిలిన ముగ్గురు.. సిట్టింగ్ ఎంపీ విల్సన్, తమిళ రచయిత సల్మా, డీఎంకే నేత ఎస్ ఆర్ శివలింగం. దీంతో కమల్ రాజ్యసభకు వెళ్లడం లాంఛనమే కానుంది. 2018, ఫిబ్రవరి 21వ తేదీన కమల్ హాసన్ ఎన్ఎంఎం పార్టీని మధురైలో స్థాపించారు. అప్పటి నుంచి ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభావం చూపెట్టలేకపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీ చేసినప్పటికీ. ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. అయితే.. ఓటు షేర్ మాత్రం 3.72 శాతం దక్కించుకుంది.మరీ ముఖ్యంగా చెన్నై, కోయంబత్తూరు, మధురైలో భారీగా ఓట్లు పడ్డాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నూ పోటీ చేసినా.. ఒక్క సీటు గెలవలేకపోయింది. కోయంబత్తూరులో పోటీ చేసిన కమల్.. బీజేపీ అభ్యర్థి వనతిశ్రీనివాసన్ చేతిలో 1,728 ఓట్ల మెజారిటీ లోఓటమి పాలయ్యారు. 2022 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసినా.. 140 స్థానాలకు ఒక్కటి కూడా గెలవలేకపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇండియా కూటమి కి కమల్ పార్టీ ఎంఎన్ఎం మద్దతు ప్రకటించి ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో డీఎంకే ఎంఎన్ఎం మధ్య ఓ ఒప్పందం కుదిరినట్లు తమిళ మీడియా వర్గాలు కథనాలు ఇచ్చాయి.లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడమా? లేదంటే రాజ్యసభకు వెళ్లడమా? అనే ఛాయిస్ కమల్‌కు డీఎంకే ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో ఆయన రాజ్యసభకే మొగ్గు చూపినట్లు ఆ కథనాల సారాంశం.

### ధాన్యం కొనుగోలు చేసేందుకు రోడ్డుపై రైతుల ఆందోళన

దంతాలపల్లి : కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే కొనే నాథుడు లేక కళ్లల్లోని ధాన్యం నీటి పాలవుతోంది. దంతాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కుమ్మరి కుంట్ల మండలంలో నెలరోజుల క్రితం వచ్చిన ధాన్యాన్ని కూడా కాంటాలు పెట్టడం లేదన్నారు.

# ట్రంప్ కెనడాకు స్పెషల్ ఆఫర్.. అలా చేస్తే గోల్డెన్ డోమ్ ఫ్రీ అంటూ..




వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాను తాను ప్రతిపాదించిన $175 బిలియన్ల 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థలో ఉచితంగా చేరాలని పిలుపునిచ్చారు.ఇందుకోసం కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ షరతు విధించారు. "వారు ఒక ప్రత్యేక దేశంగా ఉంటే వారికి $61 బిలియన్లు ఖర్చవుతుందని నేను కెనడాకు చెప్పాను, కానీ వారు అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే వారికి సున్నా డాలర్లు ఖర్చవుతాయి" అని ట్రంప్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో రాసుకొచ్చారు. "వారు ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు" అని అధ్యక్షుడు తన పోస్ట్‌లో పేర్కొన్నారు.గత వారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్డెన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థ కోసం ప్రణాళికలను ఆవిష్కరించారు. ఇది మొదటిసారిగా అమెరికన్ ఆయుధాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లే %వి%175 బిలియన్ల బహుళస్థాయి వ్యవస్థ. ఓవల్ కార్యాలయం నుంచి మాట్లాడుతూ.. 2029 నాటికి ఈ వ్యవస్థ పూర్తిగా పనిచేయగలదని, అంతరిక్షం నుంచి ప్రయోగించబడినా, క్షిపణులను అడ్డగించగలదని ఆశిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు.కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ తన ప్రభుత్వం గోల్డెన్ డోమ్ కార్యక్రమంలో పాల్గొనడం గురించి అమెరికాతో చర్చలు జరుపుతోందని అంగీకరించారు. "కెనడియన్లకు భద్రతా చర్యలు తీసుకోవడం మంచిది" అని మార్క్ కార్నీ గత వారం విలేకరుల సమావేశంలో అన్నారు. అధునాతన క్షిపణి కవచం గోల్డెన్ డోమ్ గురించి అధ్యక్షుడు ట్రంప్, ఇతర సీనియర్ అమెరికా అధికారులతో చర్చలు జరిపినట్లు ఆయన ధృవీకరించారు.

# మహానాడులో టిడిపికి విరాళాల వెల్లువ

కడప,మహానాడు వేదికగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు టీడీపీకి విరాళాల వర్షం కురిసింది.. కేవలం రెండు గంటల వ్యవధిలోనే 17 కోట్లకు పైగా విరాళాలు వచ్చినట్టు టీడీపీ ప్రకటించింది.. పార్టీ తరపున సేకరించిన విరాళాలు పార్టీ కోసమే కాకుండా, పేదలు, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ఖర్చు చేస్తామని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు .. టీడీపీకి విరాళాలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు పిలుపునివ్వగా.. రెండు గంటల వ్యవధిలోనే భారీగా విరాళాలు ఇచ్చారు టీ-డీపీ నేతలు, కార్యకర్తలు.. పార్టీలో డబ్బున్న నేతలు కార్యకర్తల సంక్షేమానికి విరాళాలు ఇవ్వాలి కోరారు సీఎం చంద్రబాబు.. అయితే, పార్టీ బ్యాంకు ఖాతాను ప్రకటించిన వెంటనే 17 కోట్ల రూపాయల విరాళాలు వచ్చాయని ప్రకటించారు.. పార్టీకి విరాళాలు ఇచ్చిన దాతలు అందరికీ అభినందనలు.. ఆన్‌లైన్‌లో కూడా పార్టీకి విరాళాలు అందించవచ్చు.. అన్నారు చంద్రబాబు.. మహానాడు ఎప్పుడు నిర్వహించినా హుండీ ఏర్పాటు- చేసి.. సేకరించిన విరాళాలు పేదల కోసం ఖర్చు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది.. మహానాడు తొలిరోజు ప్రకటన చేయగానే స్పందించి రూ.17 కోట్లకు పైగా విరాళాలు అందించిన టీడీపీ నేతలు, అభిమానులు అందరికీ అభినందనలు తెలియజేశారు కడప వేదికగా పసుపు పండుగ మహానాడు అట్టహాసంగా సాగుతోంది.. మంగళవారం ప్రారంభమైన మహానాడు.. మరో రెండు రోజుల పాటు- కొనసాగనున్న విషయం విదితమే..

# భారత నాణ్యతా ప్రమాణాలు భేష్

న్యూఢిల్లీ,నాణ్యతా ప్రమాణాల విషయంలో భారత్ అగ్రభాగానుందని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. భారత ప్రమాణాలు ఇప్పుడు ప్రపంచ ప్రామాణికంగా మారుతున్నాయని నాదెండ్ల మనోహర్ అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. త్వరలో బులియన్ హాల్ మార్కింగ్ ప్రారంభిస్తామని, వెండి ఆభరణాలపై హాల్ మార్కింగ్ కోసం విధాన ప్రకటన చేస్తామని కేంద్రమంత్రి తెలిపారని నాదెండ్ల మనోహర్ చెప్పారు. భారత దేశంలో ప్రమాణాల పరిరక్షణ, నాణ్యత నియంత్రణ, వినియోగదారుల న్యాయ హక్కుల పరిరక్షణలో బీఐఎస్ పాత్ర స్పష్టంగా ప్రతిబింబిస్తోందన్నారు.2014-15లో భారత్‌లో కేవలం 2,000 స్టాండర్డ్స్ ఉన్నాయని.. 2025 నాటికి ఆ సంఖ్య 23,000లకు చేరిందన్నారు. ప్రమాణీకరణ సంఖ్యను 55వేలకు పెంచడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమన్నారు. భారత్ తయారు చేసిన స్టాండర్డ్స్ 95 శాతం హార్మొనైజ్‌గా గుర్తింపు పొందాయని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమన్వయం చేశారని వివరించారు. హాల్ మార్కింగ్‌లో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 371 జిల్లాల్లో బంగారం హాల్ మార్కింగ్ అమలులో ఉందన్నారు. దేశ వ్యాప్తంగా విస్తరణలో భాగంగా ప్రతి జిల్లాలో హాల్ మార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

# భారత్‌కు బూస్ట్..

న్యూఢిల్లీ,ప్రపంచ వాణిజ్య ముఖచిత్రం వేగంగా మారిపోతుంది. ఒకప్పుడు చైనా ప్రపంచానికే కర్మాగారంగా భావించబడేది. కానీ, ఇప్పుడు అమెరికా, చైనాల మధ్య సాగుతున్న వాణిజ్య యుద్ధం, వాటి విధానపరమైన మార్పులు అనేక దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు అనూహ్యమైన అవకాశాలను తీసుకొస్తున్నాయి. అమెరికా తన దిగుమతి విధానాల్లో తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు, ముఖ్యంగా చైనాపై విధించిన టారిఫ్‌లు, ఇతర దేశాల నుంచి ఉత్పత్తిని ప్రోత్సహించేలా చేస్తున్నాయి. ఈ పరిణామాలు భారతీయ కంపెనీలకు ఎలా లాభం చేకూరుస్తున్నాయి, అంతర్జాతీయ వాణిజ్య రంగంలో భారత్ స్థానం ఎలా బలపడుతోందో ఈ కథనంలో తెలుసుకుందాం.

చైనా స్థానాన్ని భర్తీ చేస్తున్న భారత్?

అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగే కొద్దీ, అనేక అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తి కేంద్రాలను చైనా నుంచి ఇతర దేశాలకు మార్చాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ ఒక ఆకర్షణీయమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఇక్కడ తక్కువ ఉత్పత్తి ఖర్చులు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి, పెరుగుతున్న వినియోగదారుల మార్కెట్ వంటి అంశాలు అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, బ్లూ స్టార్, హావెల్స్ వంటి భారతీయ దిగ్గజాలు ఇప్పటికే ఈ మార్పుల నుండి లబ్ధి పొందుతున్నాయి.

ఆర్డర్ల వెల్లువ

అమెరికాలోని తమ భాగస్వాముల నుంచి ఈ భారతీయ కంపెనీలకు కొత్త ఆర్డర్లు భారీగా వస్తున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్ వంటి సంస్థలు ఈ డిమాండ్‌ను అందుకోవడానికి తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని 50శాతం వరకు పెంచుకుంటున్నాయి. టెక్నాలజీ దిగ్గజాలు కూడా భారత్ వైపు చూస్తున్నాయి. ఉదాహరణకు, గూగుల్ వంటి కంపెనీలు తమ హ్యాండ్‌సెట్‌లను భారత్ నుంచి ఎగుమతి చేయడాన్ని ఆలోచిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది 'మేడ్ ఇన్ ఇండియా' బ్రాండ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి ఎంతో దోహదపడుతుంది.హావెల్స్ వంటి సంస్థలు ఇప్పటికే భారత్‌లో తయారైన ఎయిర్ కండిషనర్లను అమెరికాకు ఎగుమతి చేయడం ప్రారంభించాయి. టాటా కన్స్యూమర్ వంటి ఎఫ్ఎంసిజి కంపెనీలు కూడా, టీ వంటి ఉత్పత్తులను అమెరికా కు ఎగుమతి చేయడంలో తమ పోటీ స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నాయి. అమెరికాలో ఈ ఉత్పత్తులు ఉత్పత్తి కానందున, భారతీయ ఉత్పత్తులకు మంచి అవకాశం లభిస్తోంది.

ఆర్థిక వృద్ధికి కొత్త ఊతం

ఈ వాణిజ్య మార్పులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. భారతీయ కంపెనీల ఆదాయం పెరుగుతోంది.. లాభాలు మెరుగుపడుతున్నాయి. టెక్స్‌టైల్ రంగం వంటివి కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత వృద్ధిని సాధించవచ్చని అంచనా వేస్తున్నారు. అమెరికాతో కుదరనున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కూడా భారత ఎగుమతులకు మరింత ఊతమివ్వనుంది. ఇవన్నీ కలిసి మన దేశీయ పరిశ్రమలకు కొత్త రెక్కలు తొడిగి, ప్రపంచ వాణిజ్య పటంలో భారత్‌ను మరింత ఉన్నత స్థానంలో నిలబెడతాయి.

# ఉభయ తెలుగు రాష్ట్రాలకు కొత్త జడ్జిలు

న్యూఢిల్లీ,దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు, కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత తెలంగాణ హైకోర్టుకు, కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు

# విదేశీ విద్యార్థులకు ట్రంప్ మరో షాక్



వాషింగ్టన్,అమెరికా ప్రభుత్వం విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. ముఖ్యంగా భారతీయ విద్యార్థులతో సహా ఎవరైనా తమ విద్యా సంస్థల్లో తరగతులకు క్రమం తప్పకుండా హాజరుకాకపోయినా, అనుమతి లేకుండా విద్యా కార్యక్రమాల నుంచి వైదొలగినా వారి స్టూడెంట్ వీసాలను రద్దు చేయనున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం (యూఎస్ ఎంబసీ) తేల్చి చెప్పింది. ఈ నిబంధనల ఉల్లంఘన భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసా పొందే అర్హతపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. ఈ పరిణామాలు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనా కాలం నుంచి విదేశీ విద్యార్థులపై పెరుగుతున్న నిఘా , కఠిన వైఖరికి అద్దం పడుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

విస్తరిస్తున్న ఆంక్షల వలయం:

కేవలం విద్యా సంబంధిత విషయాలకే పరిమితం కాకుండా, ఇతర కార్యకలాపాలపై కూడా అమెరికా దృష్టి సారించింది. ఇటీవల పాలస్తీనాకు మద్దతుగా జరిగిన ఆందోళనలలో పాల్గొన్న విద్యార్థుల వీసాలు, అలాగే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, అతివేగంతో వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడిపిన కేసులలో కూడా వీసాలు రద్దు చేయబడ్డాయి. ఈ కఠిన చర్యల నేపథ్యంలో కొందరు భారతీయ విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఉదాహరణకు వీసాలు రద్దయిన 133 మంది విద్యార్థులు న్యాయస్థానంలో పోరాడి ఊరట పొందగలిగారు.

భారతీయ విద్యార్థులపై ప్రభావం:

అమెరికా అనుసరిస్తున్న ఈ కఠిన విధానాలు, ముఖ్యంగా భారతీయ విద్యార్థులకు అమెరికాలో విద్యావకాశాలను మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై ఉన్న విద్యార్థులు తమ ఉపాధి స్థితిని 90 రోజుల్లోగా తప్పనిసరిగా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కు నివేదించాలని, లేనియెడల వారు తమ చట్టబద్ధమైన హోదాను కోల్పోతారని హెచ్చరికలు జారీ అయ్యాయి. చిన్నపాటి పొరపాట్లు కూడా తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన, గందరగోళం నెలకొన్నాయి.

గణాంకాలు, మారుతున్న ధోరణులు:

భారత విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2025 నాటికి సుమారు 18 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారని అంచనా. వీరిలో అమెరికాలో 3,31,602 మంది, కెనడాలో 1,37,608 మంది, యూకేలో 98,890 మంది ఉన్నారు. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే, అమెరికాలో భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుండగా, కెనడా , యూకేలలో ఈ సంఖ్య పెరుగుతోంది. అమెరికా అనుసరిస్తున్న కఠిన వీసా విధానాలే ఈ మార్పునకు కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు సూచనలు:

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా వీసా నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. తమ విద్యా సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారి మార్గదర్శకాలను పాటించాలి. తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలి మరియు OPT నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. వీసా సంబంధిత సమస్యలు ఎదురైతే తక్షణమే అనుభవజ్ఞులైన న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా విద్యార్థులు అమెరికాలో తమ విద్యా లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది.

# కులగణన వర్సెస్ కేబినెట్ బెర్త్: రేవంత్ రెడ్డి ముందు అసలైన సవాల్..!

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మాదిగ కులానికి చెందిన ఎమ్మెల్యేలు కేబినేట్‌లో తమకు ఈ సారి సరైన ప్రాధాన్యత ఇవ్వవాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వైపు కుల వర్గీకరణలో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని సీఎం రేవంత్ చెబుతున్నారు. కొత్తగా విస్తరిస్తోన్న కేబినేట్‌లో అన్ని సామాజికవర్గాలకు సమాన న్యాయం ఎలా చేయబోతున్నారనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా మాదిగ సామాజికవర్గం నుంచి వస్తున్న డిమాండ్లు ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాళ్లుగా మారుతున్నాయి. ఇప్పటికే కేబినేట్‌లో బెర్త్ కోసం పలు డిమాండ్లు ఇప్పటికే ముఖ్యంత్రి ముందుకు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ సర్వత్ర నెలకుంది.ప్రస్తుతం తెలంగాణ కేబినేట్‌లో ముఖ్యమంత్రితో సహా 12మంది మంత్రులు ఉన్నారు. సీఎంను కలుపుకొని వీరిలో నలుగురు రెడ్లు, ఇద్దరు షెడ్యూల్ కులాల మంత్రులు, అందులో ఒకరు డిప్యూటీ సీఎం, ఇద్దరు బీసీలకు చెందినవారు, ఒకరు గిరిజనులు(ఎస్‌టీ), ఒకరు బ్రాహ్మణ, ఒకరు కమ్మ సామాజిక వర్గంతోపాటు మరో బీసీ కోటాలో మంత్రి ఉన్నారు. అయితే ఇప్పుడు మొత్తం 18 మంది వరకు కేబినెట్ విస్తరిం చేందుకు వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఎంత మంది కొత్త ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కేబినేట్‌లో అవకాశం కల్పిస్తారనేది ఉత్కంఠగా మారింది.

అసెంబ్లీలో కాంగ్రెస్ సామాజికర్గ సమీకరణలు..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 64 మంది ఎమ్మెల్యేలు సామాజికంగా చూసినప్పుడు, కుల ప్రాతినిధ్యంలో స్పష్టమైన అసమతుల్యత కనిపిస్తోంది. తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గం మొత్తం రాష్ట్ర జనాభాలో కేవలం 5 శాతం మాత్రమే ఉన్నా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో 30 నుంచి 40 శాతం వరకు రెడ్లు ఉన్నారు. అంటే దాదాపు 19 నుంచి 26 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది వారి జనాభా శాతం కంటే అధిక ప్రాతినిధ్యాన్ని సూచిస్తుందని పలువురుల అభిప్రాయపడుతున్నారు.మరోవైపు ఎస్సీలు రాష్ట్ర జనాభాలో 17 శాతం మేర ఉన్నా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 15%-% 20 శాతం మాత్రమే(అంటే దాదాపు 10%-% 13 మంది మాత్రమే). ఇదే విధంగా బీసీలు రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉండే వర్గం సుమారు 56 శాతం ఉన్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో వారికి 15%-% 25 శాతం మాత్రమే ప్రాతినిధ్యం లభించింది(దాదాపు 10- 16 మంది). రెడ్డి సామాజికవర్గంతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ అనే విమర్శలు వస్తున్నాయి. గిరిజనులు(ఎస్‌టీలు) రాష్ట్ర జనాభాలో సుమారు 10 శాతం వరకు ఉన్నా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో వారిది కేవలం 6-10 మంది ప్రాతినిధ్యం మాత్రమే. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా గెలవలేదు. రాష్ట్రంలో ముస్లిం జనాభా సుమారుగా 12-14 శాతం ఉన్నా, వారి ప్రాతినిధ్యం పూర్తిగా శూన్యంగా మిగిలింది. ఈ గణాంకాలన్నీ చూస్తే, కుల పరంగా కాంగ్రెస్ పార్టీ విజయంలో స్పష్టమైన అసమతుల్యత ఉన్నట్లు స్పష్టమవుతుంది. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాతినిధ్యం లభించగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం వర్గాలు తక్కువ ప్రాధాన్యత ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కుల అసమతుల్యత నేపథ్యంలోనే రాబోయే కేబినెట్ విస్తరణలో సామాజిక న్యాయాన్ని పాటించాలని, అన్ని వర్గాలకు గౌరవప్రదమైన ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్లు ఇప్పుడు అన్ని వైపుల నుంచి వస్తున్నాయి.

ఏళ్ల తరబడిన నిర్లక్ష్యం..

ఎస్సీ జనాభాలో 60 శాతం, రాష్ట్ర జనాభాలో దాదాపు 9 శాతం ఉన్న మాదిగలు పాలనా వ్యవస్థలో మినహాయింపుగా మిగిలిపోతున్నారు. 2011 జనగణన ప్రకారం మొత్తం 54.32 లక్షల ఎస్సీ జనాభాలో 32.33 లక్షల మంది మాదిగలు ఉన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య 50 లక్షలుగా అంచనా వేయబడుతోంది. కానీ సంఖ్యల పరంగా ఉన్న బలానికి విరుద్ధంగా, తెలంగాణలో వారి రాజకీయ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వ్ లోక్‌సభ స్థానాల్లో ఇద్దరికి మాల కులానికి చెందిన నాయకులే ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే కోటాలో ఎస్సీలకు కేటాయించిన ఏకైక ఎమ్మెల్సీ స్థానం కూడా మాలకే దక్కింది. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, స్పీకర్ ఇద్దరూ మాలలకు చెందినవారే. మాదిగలకు కేబినెట్‌లో ఒక్క ప్రాతినిధ్యం ఉన్నా, అది కూడా మొత్తం ఎస్సీలలో కేవలం 1 శాతం ఉన్న మోచే అనే ఉపకులానికి చెందినవారు. దీంతో ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న ఐదుగురు మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు రాబోయే కేబినేట్ విస్తరణలో తమకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నారు. తమ ఐదుగురులో ఏ ఒక్కరికి అవకాశం కల్పించిన తమ సామాజికవర్గానికి ప్రాద్యానత లభించినట్లు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చరిత్రలో మాదిగల పాత్ర, పార్టీ ల హామీలు..

1956 నుంచి 2000 మధ్య కాలంలో అంటే దాదాపు 44 సంవత్సరాల పాటు ఎస్సీ కోటా ఒకే వర్గంగా ఉండింది. ఈ వ్యవధిలో మాదిగలు దాదాపు 18,000 నుండి 20,000 వరకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందగలిగారు. అయితే ఇది వారి జనాభా శాతానికి తగిన ప్రాధాన్యత కాదన్న భావన అప్పట్లో నుంచే ఉండేది. 2000 నుంచి 2004 మధ్య కాలంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎస్సీ కులాల మధ్య ఉపవర్గీకరణను అమలు చేసింది. దీంతో ఎస్సీ కోటాను మాదిగ, మాల ఇతరులుగా విడగొట్టి వారికి విడిగా ఉద్యోగాలు, అవకాశాలను కేటాయించే విధానం అమల్లోకి వచ్చింది. ఫలితంగా కేవలం నాలుగు సంవత్సరాల లోపే మాదిగలకు దాదాపు 23,500 ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. ఈ నేపథ్యంలో 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ మాదిగల డిమాండ్లను సానుకూలంగా స్వీకరించింది. మాదిగల సామాజిక, ఆర్థిక వెనుకబడిన స్థితిని గుర్తించి కాంగ్రెస్ పార్టీ 'చెవెళ్ల డిక్లరేషన్' అనే పేరుతో ఓ ప్రత్యేక ప్రకటన చేసింది. ఇందులో ఎస్సీ ఉపవర్గీకరణకు మద్దతు ప్రకటించి. అంతేకాక, ఎన్నికల తర్వాత తెలంగాణ శాసనసభలో ఎస్సీ వర్గాల మధ్య ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలను గుర్తించే బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించింది. ఇది మాదిగ వర్గానికి చెందిన నేతలు, సంఘాలు ఎంతో కాలంగా కోరుకుంటున్న ప్రాధాన్యమైన అడుగు. ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమయంలో మాదిగలకు ఒక్క మంత్రి పదవీ కూడా దక్కలేదు. ఎస్సీ కోటాలో ప్రాధాన్యం మాల వర్గానికే ఎక్కువగా దక్కిందనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. దీంతో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకిచ్చిన హామీలను అమలు చేయాలని, చారిత్రకంగా జరిగిన ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వస్తున్నాయి. ఈ డిమాండ్లు కేవలం రాజకీయ పదవుల కోసమే కాక, మాదిగ వర్గానికి హక్కుగా భావించిన సామాజిక న్యాయం, ప్రాతినిధ్యం వంటి అంశాలను సాధించడానికని ఆ సామాజికవర్గానికి చెందిన నేతలు అంటున్నారు.

తమ స్వరం వినిపిస్తోన్న ఐదుగురు మాదిగ ఎమ్మెల్యేలు..

తెలంగాణలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎన్నో దశాబ్దాలుగా పార్టీకి విధేయంగా ఉన్న తమ వర్గానికి న్యాయం జరిగేలా కనీసం ఒకరిని అయినా మంత్రివర్గంలో చేర్చాలనీ కాంగ్రెస్ అధిష్టానాన్ని గట్టిగా కోరుతున్నారు. వీరిలో అందరూ కూడా మాదిగ వర్గానికి చెందినవారే కావడం, అలాగే కాంగ్రెస్ ఉద్యమాల్లో పాలు పంచుకున్న కార్యకర్తలుగా గుర్తింపు పొందిన వారు కావడం విశేషం. ఈ ఐదుగురు నేతలు తమలో ఎవరు మంత్రి అయిన తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇది వ్యక్తిగత పదవుల కోరికకోసం కాదు, తమ వర్గానికి న్యాయం చేయాలనే, సరైన ప్రాతినిధ్యం కల్పించాలనే న్యాయపరమైన డిమాండ్ కోసం ఆరాటమని వారు పేర్కొన్నారు. "మాలో ఎవరు కేబినెట్‌కు ఎంపికైనా మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఇది వ్యక్తిగతంగా మంత్రిపదవి కోసం పోరాటం కాదు. ఇది మాదిగ వర్గానికి న్యాయం జరగాలనే ఆశయంతో చేస్తున్న విజ్ఞప్తి. మా వర్గం గతంలో ఎప్పుడూ కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. ఈసారి జరిగిన 2023 ఎన్నికల్లో కూడా కీలక నియోజకవర్గాల్లో విజయాన్ని సాధించేందుకు ముఖ్యమైన పాత్ర పోషించింది" అని కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ అట్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

కేబినేట్ కోసం వినిపిస్తోన్న పేర్లు..

కేబినేట్ విస్తరణ నేపథ్యంలో ఎవరు మంత్రి పదవి దక్కించుకుంటారనే ఉత్కంఠ రాష్ట్రమంతటా నెలకొంది. సామాజిక సమతుల్యత, రాజకీయ సమీకరణాలు, పార్టీలో సేవల పరిగణతితో కలిపి ఎన్నో అంశాల ఆధారంగా పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో విశ్వసనీయ వర్గాల నుంచి లభిస్తున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కొన్ని పేర్లను తన పార్టీ అధిష్టానానికి పంపినట్టు చెబుతున్నారు. వీరిలో సామాజిక విభజనకు అనుగుణంగా వివిధ వర్గాలను ప్రతినిధీకరించేలా ఎంపికలు జరిగే

# 99 రూపాయలకు ఎకరా ఇచ్చినట్లు రుజువు చేస్తావా

కడప,యూఆర్ఎస్ఏ కంపెనీకి ఎకరానికి 99 రూపాయలకు ఇచ్చామని నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానంటూ మంత్రి లోకేశ్ ఛాలెంజ్ చేశారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. టీసీఎస్‌కు 99 పైసలకు ఇచ్చామని.. టాప్ 100 ఐటీ కంపెనీల్లో ఎవరు వచ్చినా ఇలానే ఇస్తామని అన్నారు. జగన్ తీరు దొంగే దొంగ అన్నట్టు ఉందని వ్యాఖ్యలు చేశారు. జగన్ హయాంలో పరిశ్రమలను తరిమేశారని మండిపడ్డారు. లిక్కర్ కేసులో దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందని మంత్రి అన్నారు. సీఎం పదవి పోయాక కూడా జగన్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.రాబోయే ఐదు దశాబ్దాలు పార్టీ భవిష్యత్ బాగుండాలని.. అందుకనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టామని అన్నారు. లోకేష్ పార్టీలో ఒక భాగమే అని... ఆయనే పార్టీ కాదని అన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చేస్తానని.. పార్టీ కార్యకర్తలు ఏ పదవి అడిగినా ఇస్తామని అన్నారు. సీనియర్లు, జూనియర్లు కలిసి పని చేయాలని.. అప్పుడే పార్టీ ముందుకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. కార్యకర్తల్లో కసి ఉందని... బాగా ఆక్టివ్‌గా ఉన్నారన్నారు. అధికారంలో ఉన్నామని.. అధికారంలోకి వచ్చాక అహం ఉండకూడదని అన్నారు. ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తామని.. మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఈ గ్రూప్ ఉంటుందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి భేటీ అవుతారన్నారు. ఇందులో కార్యకర్తల సాధక బాధలు తెలుసుకుంటారని చెప్పారు. పార్టీలో ఎప్పుడు చర్చ అనేది ఉండాలని.. అప్పుడే పార్టీ వైబ్రెంట్‌గా ఉంటుందని అన్నారు. గడిచిన 11 నెలల్లో అన్ని ప్రాంతాలకు ప్రాజెక్టులు వచ్చాయన్నారు. రాయలసీమలో రెన్యువల్ పవర్‌ను తీసుకొచ్చామని తెలిపారు. సజ్జన్ జిందాల్ కడపలో స్టీల్ ఫ్యాక్టరీ పెట్టేందుకు ముందుకు వచ్చారని.. మరో 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తున్నారని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో 5లక్షల ఉద్యోగాలు కల్పిస్తే ఇక విశాఖ నగరాన్ని అందుకోలేమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో చేస్తోందని వ్యాఖ్యానించారు. మద్యం కుంభకోణంలో జగన్ వైఖరి దొంగే.. దొంగ దొంగ అన్నట్టు-గా ఉందని ఎద్దేవా చేశారు.రాష్ట్రానికి ఇక పరిశ్రమలు వస్తాయే కానీ.. ఒక్కటి కూడా బయటకు పోదని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోవటానికి ఏపీలో ఇప్పుడు వైకాపా ప్రభుత్వం లేదన్నారు. పార్టీ తనకు ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన అందరికీ పదవులు వస్తాయని, పదవులు రాలేదని నేతలు అలకబూనడం మానేయాలని హితవు పలికారు. తాను విద్యాశాఖ మంత్రి అయ్యాక ఏపీలో ఏ ఒక్క పాఠశాల కూడా మూసివేయలేదన్నారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని వైకాపా నేతలు కళ్లు తెరిచి చూడాలన్నారు.పార్టీ కార్యకర్తలు అందరికి ఒకేసారి న్యాయం చేయలేమని.. కానీ పార్టీ కోసం పని చేసిన చాలా మందికి పదవులు ఇచ్చామన్నారు. వన్ క్లాస్ వన్ టీచర్ పాఠశాలలు 9,800 పాఠశాలలు ఏర్పాటు-చేశామన్నారు. ఒక్క పాఠశాల కూడా మూయలేదన్నారు. ప్రధానితో రెండు గంటల సేపు కూర్చోవడం తన అదృష్టమని చెప్పుకొచ్చారు. 'నేను ప్రధానికి 20 ప్రశ్నలు వేశాను. ఆయన నాకు తండ్రిలా సమాధానం చెప్పారని అన్నారు. ప్రభుత్వానికి ఎంత సమయం కేటాయిస్తామో పార్టీకి కూడా అంత సమయం కేటాయిస్తామని వెల్లడించారు. ఈ సారి ప్రభుత్వం, పార్టీని రెండు బ్యాలెన్స్ చేస్తామని తెలిపారు. కుప్పంలో ఎనిమిది సార్లు చంద్రబాబు గెలిచారు కాబట్టి ఆయన మార్క్ డెవలప్‌మెంట్ కనిపిస్తుందన్నారు. ఇదిలావుంటే మహానాడు వేదికగా టీ-డీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కి కీలక బాధ్యతలు అప్పగిస్తారనే చర్చ సాగుతోంది.. మరోవైపు, లోకేష్‌ను డిప్యూటీ సీఎంను చేయాలనే అభిప్రాయం కూడా గతంలో గట్టిగానే వినిపించింది.. అయితే, ఇప్పుడు ముఖ్యమంత్రి పదవిపై మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తదుపరి సీఎం మీరేగా అన్న మీడియా ప్రశ్నకు లోకేశ్ సమాధానమిస్తూ.. ముఖ్యమంత్రి పదవికి అంత తొందరేముందని ప్రశ్నించారు.. సీఎం చంద్రబాబు యంగ్ అండ్ డైనమిక్ నాయకులు.. ఆయన ఇంకా యువ నాయకుడే అని అభివర్ణించారు.. దేశానికి ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం చాలా అవసరం.. ప్రజలకు సేవ చేసేందుకు పదవితో సంబంధం లేదన్నారు. అధికారంలోకి వచ్చాం కాబట్టి అంతా బాగుందనే భావన సరికాదు.. క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్తేనే వాస్తవాలు తెలుస్తున్నాయన్నారు లోకేష్.. వీరయ్య చౌదరికి నివాళు లర్పించేందుకు వెళ్తే పొగాకు రైతుల సమస్యలు తెలిశాయి. వెంటనే అధికారులను, మంత్రుల బృందాన్ని అప్రమత్తం చేశాం.. పార్టీకి నిరంతరం ఫీడ్‌బ్యాక్ అవసరం అనటానికి ఇదో ఉదాహరణగా పేర్కొన్నారు.. కింది స్థాయి అభిప్రాయాలపై నిరంతరం చర్చ జరగాలి.. పార్టీ బలంగా ఉండాలి.. సంస్థాగతంగా బాగుండాలని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం తెలుగుదేశం పార్టీ లక్ష్యం. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని కుటుంబాలకు సామాజిక సమన్యాయం చేయాలి. అందుకే ప్రతివారికి న్యాయం చేసేలా సోషల్ రీ ఇంజనీరింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు.. మనరాష్ట్రంలో బలమైన యువశక్తి ఉంది. వారికి సరైన అవకాశాలు ఇస్తే దూసుకుపోతారు. అన్నిరంగాల్లో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే యువగళం లక్షియంగా పేర్కొన్నారు.

# సినిమా హాళ్లలో రేట్లు దారికి రావాల్సిందే

హైదరాబాద్, సగటు సినిమా ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడం అనే అంశం పై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని దిల్ రాజు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలను అందరికీ అందుబాటులోకి తేవాలన్న పవన్ అభిప్రాయం అభినందనీయం. దీనిని మనమందరం స్వాగతించి, కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని అన్నారు. అలాగే, థియేటర్ల నుంచి ఓటీ-టీ- ఎ÷-లాట్ ఫామ్ కి సినిమాలు త్వరగా వెళ్తుండటంతో ప్రేక్షకులు ఓటీటీ వైపు మొగ్గు చూపుతున్నారు. కాబట్టి, ఒక సినిమా ఎంత కాలానికి ఓటీటీకి వెళ్ళాలి అనే అంశంపై మనమందరం కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందని ఆయన సినీ వర్గాల వారిని అన్నారు. ప్రేక్షకుడికి వెండితెరపై సినిమా చూసే అనుభూతిని అర్థవంతంగా తెలియజేయడం మనందరి బాధ్యత, ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా కాకుండా ఫిలిం ఛాంబర్ ద్వారా మాత్రమే సంప్రదించాలనే సూచన పరిశ్రమకు శాశ్వత దిశ ఇస్తుంది. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమ ప్రభుత్వాలతో కలసి ముందుకు సాగాలి. ఈ దిశగా ముఖ్యమైన తొలి అడుగులు వేసిన గౌరవనీయులు పవన్ కళ్యాణ్ కి నా ప్రత్యేక కృతజ్ఞతలు అని ఆయన అన్నారు. థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడానికి మరో ముఖ్యమైన కారణం పైరసీ. మనమంతా కలిసికట్టుగా పైరసీపై పోరాడినప్పుడే, మన ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించగలగుతాము. అలాగే, ఆంధప్రదేశ్ ప్రభుత్వం సూచించిన అన్ని అంశాలపై తెలంగాణ ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపి, మన తెలుగు సినిమా అభివృద్ధికి నిర్మాతల మండలి కలిసికట్టు-గా తోడ్పడుతాం అంటూ దిల్ రాజు పేర్కొన్నారు.

# పాక్-ఇరాన్ కొత్త స్నేహం.. చేతులు కలిపిన బద్ధశత్రువులు..



న్యూఢిల్లీ,గతేడాది ఒకరిపై ఒకరు బాంబులు వేసుకున్న దాయాది దేశం పాకిస్థాన్, ఇరాన్ ఇప్పుడు తిరిగి చేతులు కలుపుతున్నాయి. పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ ఇరాన్ పర్యటన తర్వాత ఈ పరిణామాలు మరింత స్పష్టమయ్యాయి. ప్రపంచ దేశాల ముందు భారత్‌ను దౌత్యపరంగా ఒంటరి చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో.. ఇరాన్‌తో ఈ కొత్త బంధం భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అసలు ఒకరిపై ఒకరు అనుమానంగా చూసుకునే ఈ రెండు దేశాలు ఎందుకు ఒక్కటవుతున్నాయి? దీని వెనుక ఉన్న అసలు కారణాలేంటో తెలుసుకుందాం.పాకిస్థాన్, ఇరాన్ రెండు దేశాలు ప్రస్తుతం దాదాపు ఒకే రకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు ఇజ్రాయెల్ గాజాపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇది ఇరాన్ మద్దతు ఉన్న హమాస్‌కు బలహీనమైన కోట. మరోవైపు ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్ర ఆందోళన చెంది, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. ఇది దాదాపు అరగంటలోపే సక్సెస్ అయింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ రెండు ముస్లిం దేశాలు తమ శత్రువులను ఎదుర్కోవడానికి దౌత్యపరంగా ఏకమవుతున్నట్లు కనిపిస్తోంది. ఇది వారి మధ్య శత్రుత్వాన్ని వదిలి మళ్లీ చేతులు కలపడానికి ప్రేరణగా నిలిచిందని విశ్లేషకులు భావిస్తున్నారు.పహల్గాం దాడి తర్వాత భారత్, ఇరాన్, పాకిస్థాన్‌లలోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన ప్రతిదాడికి ఈ రెండు దేశాలు ఎలాంటి స్పందన ఇవ్వలేదు. అయితే, ఈ మధ్య పాకిస్థాన్‌ను పరోక్షంగా సమర్థిస్తూ, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఇరాన్ సూచించింది. ఇది కూడా రెండు దేశాల మధ్య స్నేహం మళ్లీ చిగురించడానికి ఓ కారణం కావచ్చు.షెహబాజ్ షరీఫ్, ఇరాన్ నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మధ్య ఇటీవల జరిగిన సమావేశంలో ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్', పీఓకే (పాక్ ఆక్రమిత కాశ్మీర్) అంశాలపై చర్చించినట్లు సమాచారం. అనంతరం షెహబాజ్ షరీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఎల్లప్పుడూ శాంతియుత చర్చల ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని, అయితే భారత్ కూడా దీనికి అంగీకరించాలని అన్నారు.తర్వాత ఖమేనీ 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య విభేదాలు వీలైనంత త్వరగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఇప్పటికే రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించింది. అయితే, భారత్ తన వైఖరిని మార్చుకుంటూ కాశ్మీర్ ఒక ద్వైపాక్షిక సమస్య అని, ఇందులో ఏ మూడవ పక్షం జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, పాకిస్థాన్ ఎప్పుడూ ఇజ్రాయెల్‌తో సంబంధాలు పెట్టుకోలేదు. కొన్ని ఇస్లామిక్ దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడానికి ముందుకు వచ్చినా, పాకిస్థాన్ మాత్రం పాలస్తీనియన్లకు మద్దతునిచ్చింది. ఇది కూడా రెండు దేశాల మధ్య స్నేహానికి ఒక కారణం.గతేడాది ఇరాన్, పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో ఉన్న జైష్ అల్-ఆదిల్ ఉగ్రవాద శిబిరాలపై మిసైల్ దాడులు చేసింది. ఈ ఉగ్రవాద సంస్థ ఇరాన్‌లోని సిస్తాన్, బలూచిస్థాన్ ప్రాంతాల స్వాతంత్ర్యం కోసం పోరాడుతోంది. ఇరాన్ చేసిన ఈ దాడుల్లో అమాయక పాకిస్థాన్ పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆగ్రహించిన పాకిస్థాన్, ఇరాన్‌లోని కొన్ని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేసింది. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను అమాంతం పెంచింది. ఇలాంటి నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని సంవత్సరం తర్వాత టెహ్రాన్ పర్యటించడం, ఆ దేశంతో బలపడుతున్న సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి.ఖమేనీ తన 'ఎక్స్' ఖాతాలో ఇరాన్, పాకిస్థాన్ సంబంధాలను ఒక వేదికగా అభివర్ణించారు. రెండు దేశాలు సోదర దేశాలని, చిన్న చిన్న గొడవలు సహజమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలు పెరుగుతున్న సమయంలో ముస్లిం దేశాల మధ్య ఐక్యత ఉండాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్, ఇరాన్ చేతులు కలుపుతున్నప్పటికీ భారత్ మాత్రం జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. ఇరాన్‌తో మంచి సంబంధాలను కొనసాగిస్తూనే మే 9 తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇరాన్ విదేశాంగ మంత్రితో 20వ భారత్-ఇరాన్ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి, ఈ లక్ష్యాన్ని సాధించడానికి పరస్పరం సహకరించుకోవాలని వారు నిర్ణయించారు.

# దర్గా గుట్టపై షెడ్డు కూల్చివేతపై గ్రామస్తుల ఆగ్రహం..

ఎల్లారెడ్డిపేట, రాజన్న సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలోని దుర్వేషావలి దర్గా గుట్టపై సందర్శకుల కోసం వేసిన షెడ్డును రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అక్రమంగా షెడ్డును నిర్మించారని వచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కూల్చివేశారు.స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల దుర్వేషావలి దర్గా గుట్టపై ఉరుసు ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ఏటా గ్రామస్తులు అంతా కలిసి ఉత్సవంలో కులమతాలకు అతీతంగా పాల్గొంటారు. దీంతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి గుట్ట మైదానంలో కందూరు చేసుకోవడంతో పాటు పలు విందు వేడుకలు జరుపుతారు. దీంతో అక్కడికి వచ్చే సందర్శకుల కారణంగా చిరు వ్యాపారులు సైతం ఆర్థిక వెసులుబాటుగా భావిస్తుంటారు.

అయితే ఇటీవల ఉరుసు ఉత్సవాలు జరిగిన సమయంలో గుట్టపై ఏర్పాటు చేసిన షెడ్డును అక్రమంగా నిర్మించారని పలువురు బీజేపీ నాయకులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు షెడ్డును కూల్చివేశారు.ఉదయం లేవగానే విషయం తెలుసుకున్న గ్రామస్తులు షెడ్డు కూల్చివేత ఘటనపై ఆవేదన చెందారు. ఇదే సమయంలో బీజేపీ నాయకులు సింగారం దర్గా వద్ద ప్రెస్ మీట్ ఉందని ప్రకటన చేశారు. అప్పటికే ఆగ్రహంగా ఉన్న గ్రామస్తులు ఊరి పొలిమేర వద్ద బీజేపీ నాయకులను అడ్డుకునేందుకు గుమిగూడారు. రెండు కార్లలో అక్కడికి చేరుకున్న బీజేపీ నాయకులను అడ్డుకోగానే పరిస్థితిని గమనించిన వారు అక్కడనుంచి పారిపోయా రు. అయితే కారులో స్థలం లేకపోవడంతో ఒక వ్యక్తి మాత్రం అక్కడే ఉండిపోయారు. దీంతో తీవ్ర



ఆగ్రహంలో ఉన్న గ్రామస్థులు అతనిపై దాడి చేసేందుకు వెళ్లారు. అయితే అప్పటికే అప్రమత్తమైన పోలీసులు అతన్ని పోలీసు వాహనంలో అక్కడి నుంచి తప్పించారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మరికొంత మంది బీజేపీ నాయకులు సింగారం వెళ్లే ప్రయత్నం చేయగా నారాయణపూర్ శివారులో పోలీసులు అడ్డుకున్నారు. వారిని పోలీసు వ్యాన్‌లో స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో సింగారంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై రమాకాంత్ పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పోలీస్ స్టేషన్ బయట విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గుట్ట సమీపంలో కబ్జా అయిన భూమిని గుర్తించాలని అధికారులను కోరారు.

# పదకొండేళ్ళ మోడీ...టాప్ త్రీ ర్యాంకర్



న్యూఢిల్లీ,నరేంద్ర మోడీ. ఈ రోజు ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలిచారు. ఒకనాడు టీ అమ్మే కుటుంబంలో అత్యంత పేదరికంలో పుట్టి టీనేజ్ వరకూ అంతా సాదా సీదా జీవితం గడిపిన నరేంద్ర దామోదర్ దాస్ మోడీ అనే ఒక యువకుడు జీవితం ఎన్నో మేలు మలుపులు తిరిగి ఈ రోజున అంతర్జాతీయ నాయకుడిగా ఆయనను నిలిపింది అంటే కనుక దాని వెనక మోడీ కృషి పట్టుదల ఎంతటివో అందరూ తెలుసుకోవాల్సిందే.ఆయన సంఘ్ మనిషి. ఎనిమిదేళ్ళకే సంఘ్ లో చేరిన మోడీ నాలుగు దశాబ్దాల పాటు సంఘ్ సేవలోనే నిమగ్నం అయ్యారు. ఆయన సంఘ్ కోసం దేశం కోసం ఏమైనా చేయాలన్న లక్ష్యంతో పనిచేశారు. నరేంద్ర మోడీ. ఏ రోజూ పదవుల కోసం తాపత్రయ పడలేదు. అందుకే ఆయనను ఆ పదవులు వెతుక్కుని వచ్చాయి.ఆయన మంత్రి పదవి చేపట్టకుండా ఒకేసారి గుజరాత్ సీఎం అయిపోయారు. అది ఒక రికార్డు. అలా ఆయన ప్రజా జీవితం 2001లో, మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేశారు. ఆ మీదట 2002, 2007, 2012లలో మూడుసార్లు తన నాయకత్వంలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటి చేత్తో బీజేపీని గెలిపించిన మోడీ అజేయుడిగా చరిత్ర సృష్టించారు. ఆయన 13 ఏళ్ళకు పైగా నిరాటంకంగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అది సైతం ఒక రికార్డు.ఇక 2014 మే 26న ఆయన తొలిసారి దేశానికి ప్రధాని అయ్యారు. ఇది కూడా మరో రికార్డు. అప్పటిదాకా జాతీయ రాజకీయాలతో సంబంధం లేకుండా కేవలం గుజరాత్ సీఎం గానే ఉన్న మోడీ ఎకాఎకీన కేంద్ర రాజకీయాలలోకి ప్రవేశించి మొదటి ప్రయత్నంలోనే ప్రధాని అయ్యారు. అంతే కాదు అప్పటికి గత మూడు దశాబ్దాలుగా పూర్తి మెజారిటీ కేంద్రంలో రాకుండా సంకీర్ణ ప్రభుత్వాల రాజ్యం చేస్తున్న నేపథ్యంలో బీజేపీకి తొలిసారి ఫుల్ మెజారిటీ తెచ్చారు. దేశ రాజకీయాలలో ఒక సుస్థిరతను ఆయన సాధించారు. అది మరో రికార్డు.అంతే కాదు ఆయన 2019లో మరోసారి గెలిచి ప్రధాని పదవి చేపట్టడం రికార్డుగా ఉంది. ఈసరి ఆయన మే 30న ప్రమాణం చేసారు. 2014 కంటే అధిక ఎంపీ సీట్లు బీజేపీకి సాధించగలిగారు అలా మోడీ మార్క్ తో దేశ రాజకీయాలలో తనదైన ముద్ర వేశారు. ఇక 2024లో ఆయన మూడోసారి ప్రధాని జూన్ 9న కావడం ఇంకో గొప్ప రికార్డు. ఈ రికార్డు తో ఆయన దేశ తొలి ప్రధాని పండిట్ నెహ్రూ సరసన చేరారు.ఇక వరసగా మూడు సార్లు ప్రధానిగా ఇందిర సైతం కాలేకపోయారు. ఇక 11 ఏళ్ళ పాటు ప్రధానిగా కొనసాగుతూ ఆయన దేశంలో ఇప్పటిదాకా పనిచేసిన ప్రధానుల అందరినీ దాటుకుని ముందుకు సాగారు. పదేళ్ళ పాటు నిరాటంకంగా కొనసాగిన కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్ ని సైతం ఆయన అలా అధిగమించారు.ఇక ఆయన ముందు మరో రికార్డు సాధించాల్సి ఉంది. దేశానికి మూడు సార్లు ప్రధానిగా చేసి మొత్తం 16 ఏళ్ళకు పైగా ఏలిన ఇందిరాగాంధీ రికార్డుని 2029 తరువాత మరోసారి ప్రధాని అయి మోడీ తిరగరాస్తారు అని బీజేపీ వర్గాలు అంటున్నాయి. అదే విధంగా దేశ తొలి ప్రధాని పండిట్ నెహ్రూ పేరుతో మరో రికార్డు ఉంది. ఆయన ఏకంగా 17 ఏళ్ళ పాటు ప్రధానిగా ఉన్నారు. 2029లో మోడీ నాలుగవ సారి గెలిచిన రెండేళ్ళకే అలా ఇందిరా గాంధీ నెహ్రూ రికార్డుని బద్ధలు కొడతారు అన్న నమ్మకాన్ని దృఢ విశ్వాస్వాన్ని బీజేపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.ఇన్ని రికార్డులు ఇప్పటికే సాధించి దేశానికి సరికొత్త దశ దిశను చూపించిన మోడీ 11 ఏళ్ళ పాలన పూర్తి చేసుకోవడం పట్ల బీజేపీ వర్గాలు ఎంతో సంతోషం వ్యక్తం చేశాయి. ఇది మోడీ నాయకత్వ పటిమకు నిదర్శనం అని బీజేపీ శ్రేణులు కొనియాడాయి. మోడీ ప్రధానిగా దేశాన్ని బలోపేతం చేశారని, తనదైన అద్భుతమైన విధానాలతో వ్యూహాత్మకమైన చర్యలతో దేశాన్ని ఎదురులేకుండా నిలిపారు అని పేర్కొన్నారు.ఇక మోడీ నాయకత్వంలో 11 ఏళ్ల క్రితం దేశంలో పరిణాంతామకమైన పాలన మొదలైంది అని బీజేపీ కొనియాడింది. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వస్, సబ్ కా ప్రయాస్ అన్న నినాదంతో దార్శనీయతతో మోడీ నాయక్త్వంలో దేశంలో ఒక అద్భుతమైన ప్రయాణం మొదలైంది అని కేంద్ర గిరిజన మంత్రి జూయెల్ ఓరం అన్నారు.అలాగే మోడీ ఈజ్ గ్రేట్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే కూడా ప్రస్తుతించారు. ఏది ఏమైనా ఈ దేశంలో మోడీ రికార్డులు ఆయన సాధించిన విజయాలు ఆధునిక యుగంలో గొప్పవని చెప్పాలి. 2029లో ఆయన మళ్ళీ ప్రధాని అయితే ఆయన కంటే అత్యధిక కాలం పాలించిన వారు బహుశా మరొకరు సమీప కాలంలో రారు రాలేరు అని ఘంటాపథంగా చెప్పవచ్చు అన్నది రాజకీయ చరిత్రకారుల స్పష్టమైన మాట.

# జూన్ 2న కవిత కొత్త పార్టీ.. రఘునందనరావు జోస్యం నిజమయ్యేనా?

హైదరాబాద్,బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ అధినేత, సొంత తండ్రి అయిన కేసీఆర్ కు రాసిన లేఖ సృష్టించిన, సృష్టిస్తున్న రాజకీయ ప్రకంపణలు ఇప్పటిలో ఆగేలా లేవు. కవిత లేఖపై బీఆర్ఎస్ నుంచి ఎటువంటి స్పందనా లేదు. చివరాఖరికి కేసీఆర్ కూడా కవిత లేఖపై స్పందించడం అటుంచి, కన్న బిడ్డను ఆ లేఖ ఎందుకు రాశావు? ఏమైనా ఉంటే నేరుగా నాకే చెప్పొచ్చుగా అని మందలించిన పాపాన కూడా పోలేదు. లేఖ వెలుగులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ కుమార్తెతో ఆయన భేటీ అయినదే లేదు. అన్నిటికీ ఒకే మందు అన్నట్లుగా మౌనాన్నే ఆశ్రయించారు.అటు కవిత కూడా తగ్గేదే లే అన్నట్లుగా తండ్రితో భేటీకి అసలు ప్రయత్నమే చేయలేదని తెలుస్తోంది. పైపెచ్చు ఆమె తన సొంత ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా ఆమె చర్యల ద్వారా తెలుస్తోంది. తాజాగా ఆమె మంగళవారం (మే 27) జాగృతి సంస్థ ప్రతినిధులతో సమావేశమై సామాజిక తెలంగాణ సహా పలు అంశాలపై చర్చించారు. జాగృతి సంస్థ ద్వారా భవిష్యత్ లో చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇక కవిత లేఖ వెలుగు చూసి రోజులు గడిచిపోతున్నా కాంగ్రెస్, బీజేపీలు అదే లేఖ ఆధారంగా బీఆర్ఎ స్ పై విమర్శలు సంధిస్తున్నారు. తాజాగా బీజేపీ సీనియర్ నాయకుడు, ఎంపీ రఘునందనరావు ఏకంగా కవిత కొత్త పార్టీ ప్రారంభించబోతున్నారని చెబుతూ, ఆ పార్టీ ఆవిర్భావ తేదీ కూడా వెల్లడించేశారు. కవిత నేతృత్వంలో తెలంగాణలో జూన్ 2న మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించబోతోందంటూ జోస్యం చెప్పేశారు. సొంత పార్టీ పెట్టడమే కాకుండా కవిత రాష్ట్రంలో పాదయాత్ర కూడా చేయనున్నారని రఘునందనరావు అన్నారు. రఘునం దనరావు వ్యాఖ్యలతో మరో సారి కవిత భవిష్యత్ కార్యాచరణ ఏమిటన్న చర్చ మరో సారి జోరుగా సాగుతోంది. రఘుఉనందనరావు చెప్పినట్లు కవిత కన్న తండ్రికి వ్యతిరేకంగా సొంత కుంపటి పెట్టుకుని రాజకీయ క్షేత్రంలో ఆయనతో తలపడటానికి రెడీ అయిపోయారా? కొత్త పార్టీ పేరు ఏమిటి? అన్న చర్చ జోరుగా సాగుతోంది.



# ధర్మ వరంలో తెలుగు తమ్ముళ్ల ధర్మ పోరాటం..!



ధర్మ వరం:ఆ నియోజకవర్గంలో ఏం జరుగుతోంది? మిగతా చోట్ల అన్నింటికంటే అక్కడే టీడీపీ శ్రేణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఎందుకు టీడీపీ శ్రేణులకు ఇబ్బందులు తప్పడం లేదనే ప్రచారం జరుగుతోంది? వైసీపీలో కూడా ఇన్ని ఇబ్బందులు పడలేదు అని ఎందుకు అంటున్నారు నేతలు? ఓపిక నశిస్తే అరచేయి ఆయుధం అవుతుందంటూ ఆ యువనేత ఎందుకు అన్నాడు? ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం తెలుసుకోవాలంటే మనం ధర్మవరంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి.ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం టీడీపీకి పెట్టని కోట. టీడీపీ ఆవిర్భావం నుంచి రెండు సార్లు తప్పించి ఇక అన్ని సార్లు విజయం ఆ పార్టీదే. కానీ 2024 ఎన్నికల్లో అనూహ్యంగా ఇక్కడ బీజేపీతో పొత్తు కుదిరి టికెట్ ఎవరికి అంతు చిక్కకుండా సత్య కుమార్ ఎగరేసుకొని పోయారు. అదే ఊపులో ధర్మవరంలో కాషాయ జెండా రెపరెపలాడింది. టీడీపీ, జనసేన కార్యకర్తలు సహాకరించడంతో మంచి మెజార్టీతో గట్టెక్కారు సత్య కుమార్. ఇదే ఊపులో ఊహకందకుండా మంత్రి పదవి కూడ సొంతం చేసుకున్నారు.ంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత కొద్దికొద్దిగా విబేధాలు మొదలయ్యాయి. క్షేత్ర స్థాయిలో పదవుల పంపకం దగ్గరి నుంచి అనేక సార్లు విబేధాలు బయటపడ్డాయి. కానీ అవి కేవలం కార్యకర్తల వరకే ఉండడంతో మీడియా వరకు రాలేదు. మొదటిసారి ఓ అధికారి విషయంలో ఇరు పార్టీల నాయకులు వీధికెక్కారు. మునిసిపల్ కమిషనర్‌గా మల్లికార్జునని నియమించడం దగ్గరి నుంచి అన్ని విబేధాలే. వరుస పెట్టి కూటమి పార్టీల మధ్య విబేధాలు జరుగుతున్నాయి. దీనిని అనేక మార్లు మంత్రి సత్య కుమార్, పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్చార్జి చిలకం మధుసూదన్ రెడ్డి ఖండించిన ఆ విబేధాలు మాత్రం ఆగడం లేదుఅసలు ఈ విభేదాలకు కారణం ఎంటా అని ఆరా తీస్తే ఓ ఆసక్తికర విషయం బయటపడింది. ధర్మవరం మంత్రి సత్య కుమార్ ప్రజా కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో ఇక్కడ ఇన్చార్జ్ బాధ్యతలు హరీష్ బాబుకు అప్పగించారు. ధర్మవరంలో మంత్రికి సంబంధించిన ఏ కార్యక్రమం అయినా అది ప్రజా కార్యక్రమమైన పార్టీ కార్యక్రమమైన మొత్తం హరీష్ బాబు చూసుకుంటారు. అదేవిధంగా ధర్మవరంలో బీజేపీ బలపడేందుకు హరీష్ బాబు మొత్తం కార్యాచరణ రూపొందిస్తూ గ్రామాలు వార్డుల్లో ఎవరైతే బలమైన బీసీ నేతలు ఉంటారో.. వారు ఏ పార్టీ అయినా సరే బీజేపీ కండువా కప్పుతూ పార్టీలోకి చేర్చుకుంటున్నారు.వరుసగా వైసీపీ నేతలను బీజేపీలోకి చేర్చుకుంటూ ఉండగా.. రెడ్డి సామాజికవర్గ నేతలు మాత్రం జనసేన బాట పడుతున్నారు. ఇలా గత ఐదేళ్లు రాజభోగం అనుభవించిన వైసీపీ నేతలు ఇప్పుడు మరోసారి పార్టీ మారి బీజేపీలోనో లేక జనసేనలోనో చేరి తమ కాలం గడుపుకుంటున్నారట. ఇది టీడీపీ నేతలకు.. క్షేత్రస్థాయిలోని కార్యకర్తలకు ఏమాత్రం రుచించడంలేదట. ఇన్నాళ్లు తాము కష్టపడితే ఇప్పుడు వైసీపీ నేతలు తాపీగా ఆ రెండు పార్టీల్లో చేరి అన్ని పనులు చేసుకుంటున్నారనేది టీడీపీ కార్యకర్తల ఆవేదన.ఈ కార్యకర్తల ఆక్రోషం ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ వరకు చేరింది. ఇటీవల జరిపిన మినీ మహానాడులో శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం ప్రాంతం నాకు చాలా ఓపిక నేర్పించిందని అందుకోసమే చాలా ఓపికతో ఉన్నానని లేదంటే నా ఒరిజినల్ లోపల అలానే ఉందంటూ పార్టీ మారుతున్న వైసీపీ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. యుద్ధం వచ్చినప్పుడు అరచేయి ఆయుధం అవుతుందని ఇది అందరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. టీడీపీ కార్యకర్తలు ఏం చేసినా దాని వెనుక తానే ఉంటానంటూ మినీ మహానాడు సాక్షిగా కార్యకర్తలకు ధైర్యం నింపారు. నాయకుడంటే పదిమంది వెనకాల ఉండేవాడు కాదని పదిమందిని ముందుకు నడిపించేవాడని.. ఒకవేళ అలా లేకుంటే చచ్చిన శవంతో సమానమని పరిటాల శ్రీరామ్ అలా ఉండలేడని కీలక వ్యాఖ్యలు చేశారు.హిందూపురం పార్లమెంట్ పరిధిలో జరిగిన జిల్లా మహానాడులో కూడా ధర్మవరం గురించి టాపిక్ వచ్చింది. జిల్లాలో టీడీపీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్న ప్రాంతం ధర్మవరం అని వారికి న్యాయం జరిపేలా మనం అందరం చూడాలన్నారు టీడీపీనేతలు. ధర్మవరం టీడీపీ శ్రేణుల్లో ధైర్యం నింపే బాధ్యత మనపై ఉందని సత్యసాయి జిల్లా టిడిపి నేతలు వ్యాఖ్యానించారు. ఇటు ధర్మవరం మహానాడులో అటు జిల్లా మహానాడులో కూడా ధర్మవరం గురించి చర్చ రావడంతో కడపలో జరిగే మహానాడుపై ధర్మవరం టిడిపి కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

# విజయసాయిరెడ్డి రాజకీయాలకు గుడ్ బై చెప్పినా ఆయనను వదిలిపెట్టని వైసీపీ

విజయవాడ:విజయసాయిరెడ్డి. వైసీపీలో కీలక నేత. ఓ రకంగా ఆ పార్టీలో నెంబర్ టు పొజిషన్ ఆయనదేనన్న ప్రచారం ఉండేది. ఏమైందో ఏమో తెలియదు కానీ..వైసీపీ ఓడిపోయాక జగన్‌తో ఇంకా గ్యాప్ పెరిగి..పార్టీని వీడటమే కాదు రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు విజయసాయిరెడ్డి. ఏ పార్టీలోకి వెళ్లడం లేదని తేల్చిచెప్పారు.అయినా వైసీపీ సోషల్ మీడియా విజయసాయిరెడ్డి టార్గెట్‌గా పోస్టులు పెట్టడం రచ్చకు దారి తీస్తోంది. సీఎం చంద్రబాబునాయుడుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఓ టీడీపీ నేతతో విజయసాయిరెడ్డి రహస్య భేటీ అయ్యారంటూ ఓ వీడియో రిలీజ్ చేసింది వైసీపీ. విజయసాయిరెడ్డి టీడీపీతో కుమ్మక్కు అయ్యారనడానికి ఇదే సాక్ష్యమని వైసీపీ నుంచి పోస్టులు వెల్లువెత్తాయి.వైసీపీ బయటపెట్టిన పోస్ట్‌కు విజయసాయి రివర్స్ కౌంటర్ స్టార్ట్ చేశారు. తనను రెచ్చగొడితే వైఎస్ జగన్‌కే నష్టమంటూ సంచలన ట్వీట్ చేసి వైసీపీకి ఇచ్చి పడేశారు. తాను మౌనంగా ఉండటం వైసీపీలో కోటరీకి సచ్చటం లేదంటూ కాస్త స్ట్రాంగ్ రియాక్షనే ఇచ్చారు. కోటరీనే తనకు వెన్నుపోటు పొడిచిందని..ఎవరో కోటరీ చేసిన నేరాలను తాను నెత్తి మీద వేసుకోవాలా లేకపోతే టీడీపీ మనిషి అయిపోతానా అని ప్రశ్నిస్తున్నారు.అంతేకాదు తాను ఈ జన్మలో టీడీపీలో చేరటం లేదని ముందే చెప్పా..కలవాలని అనుకుంటే చంద్రబాబు, లోకేశ్‌ను కలిసి చర్చిస్తానంటూ ట్వీట్ చేశారు. అంతేకాదు లిక్కర్ స్కామ్ లేదని జగన్ అంటుంటే, ఆ స్కామ్ రహస్యాలు మాట్లాడటానికి తాను టీడీపీ నేతల్ని కలిశానని జగన్ కోటరీ అంటున్నారంటూ మండిపడ్డారు.

వైసీపీ సోషల్ మీడియా, క్యాడర్ అత్యుత్సాహం?

అయితే విజయసాయిరెడ్డి విషయంలో వైసీపీ సోషల్ మీడియా, క్యాడర్ అత్యుత్సాహం చూపిస్తుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు విజయసాయిరెడ్డి జగన్‌ను ఎక్కడా డైరెక్టుగా కామెంట్ చేయడం లేదు. కోటరీ అంటూ మాత్రమే విమర్శలు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా పోస్టులు ఇలాగే కొనసాగితే..టీడీపీతో కుమ్మక్కయ్యారని విమర్శించడం కంటిన్యూ చేస్తే విజయసాయిరెడ్డి డైరెక్టుగా జగన్‌ను టార్గెట్ చేసే అవకాశం లేకపోలేదం



టున్నారు.విజయసాయిరెడ్డిని వైసీపీ ఎంత గెలకకపోతే ఆ పార్టీకి అంత మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సోషల్ మీడియా పోస్టులతో ఇరిటేట్ చేస్తే తాను స్ట్రాంగ్‌గానే స్పందిస్తానని విజయసాయిరెడ్డే చెప్తున్నారు. విజయసాయికి తమ పార్టీ సీక్రెట్స్ అన్నీ తెలుసని వైసీపీ భావిస్తుందో..లేక..ఆయన టీడీపీ మనిషని ఎక్స్‌పోజ్ చేయాలనుకుంటుందో తెలియదు కానీ.. అత్యుత్సాహానికి పోయి పోస్టులు పెట్టి గెలికి మరీ ఆయనతో గోక్కుంటున్నారన్న చర్చ అయితే నడుస్తోంది.సీఎం చంద్రబాబుకు లొంగిపోయిన విజయసాయిరెడ్డి..మూడేళ్లు రాజ్యసభ సీటును ప్రలోభాలకులోనై చంద్రబాబుకు అమ్మేశారని కామెంట్ చేశారు జగన్. అలాంటి వ్యక్తులు లిక్కర్ కేసులో ఇచ్చే స్టేట్మెంట్స్‌కు విలువ ఏముందంటూ వైసీపీ అధినేత చేసిన కామెంట్స్‌నే..ఆ పార్టీ సోషల్ మీడియాకు అస్త్రంగా మలుచుకుంటుందన్న చర్చ జరుగుతోంది.ఏదైనా విజయసాయిరెడ్డిని బద్నాం చేయాలనుకుంటే పార్టీనే ఇరకాటంలో పడుతుందన్న టాక్ వైసీపీలో కూడా వినిపిస్తోంది. వైసీపీ నేతలెవరూ విజయసాయిరెడ్డి విషయంలో పెద్దగా స్పందించనిది కూడా అందుకేనంటున్నారు. సోషల్ మీడియాలో కూడా ఆయనపై పోస్టులు పెట్టకుండా ఉంటే బెటర్ అని..లేకపోతే ఆయన టీడీపీకి అస్త్రంగా మారొచ్చన్న డౌట్స్ ఫ్యాన్ పార్టీలో వినిపిస్తున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com